ఈవీఎం వివిప్యాడ్‌లు స్ట్రాంగ్ రూముల్లో భద్రం : సబ్ కలెక్టర్ ప్రశాంత కుమార్

విశాలాంధ్ర - రంపచోడవరం : త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలకు ఈవీఎంలు. వివి ప్యాడ్లు పోలీసు నుంచి వచ్చిన వాటిని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూములో భద్రపరచడం జరిగిందని 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక గిరిజన బాలుర వసతి గృహం ప్రాంగణంలో పాడేరు నుండి రంపచోడవరం వచ్చిన ఈవీఎంలు. వివి ప్యాడ్లు రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో అరకు పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎంలు. వి వి ప్యాడ్లు రెండు కంటైనర్ల లో వచ్చిన వాటిని వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులతో రంప చోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ రంప చోడవరం, అడిషనల్ ఎస్పీ జగదీష్ సమక్షంలో కంటైనర్లలో వచ్చిన ఈవీఎంలు. వివి పేడ్ల రెండు వాహనాలలో వచ్చిన ఈవీఎంలు. వివి ప్యాడ్ వాహనాల శీలలను ఓపెన్ చేసి స్ట్రాంగ్ రూములలో భద్రపరచడం జరిగింది. ఈ సందర్భంగా రంపచోడవరం అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి యస్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అరకు పార్లమెంటుకు సంబంధించిన 11 మండలాలలో 399 పోలింగ్ కేంద్రాలకు గాను 518 ఈవీఎంలు. 518 వివి ప్యాడ్లు. 518 బ్యాలెట్ యూనిట్. 518 కంట్రోల్ యూనిట్లు ఈ నియోజక వర్గానికి రావడం జరిగిందని ఆయన తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు. వివి ప్యాడ్లు ప్రతిష్టాత్మకమైన భద్రతతో స్ట్రాంగ్ రూమ్ దగ్గర ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలి పారు. ఈవీఎంలు. వివి ప్యాడ్ల స్ట్రాంగ్ రూమ్ పరిధిలో పరిధిలో ఇతరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికి అనుమతి ఉండదని ఆయన తెలిపారు. అదే విధంగా వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూములో భద్రపరిచి సీల్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాసిల్దారు ఎ.కృష్ణ జ్యోతి, డిప్యూటీ తాసిల్దారు ఎన్ వివి సత్య నారాయణ, బి.రాజు, చైతన్య, శ్రీధర్, విశ్వనాథం, శివ, సర్వేల్ ఇన్స్పెక్టర్ వి. వెంకటేశ్వర రావు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పి. శ్రీనివాసరావు, కె.బాలకృష్ణ, చుక్క సంతోష్ కుమార్, కృష్ణారెడ్డి సీనియర్ సహాయకులు టి. లక్ష్మణరావు, ఇందిరా బాయ్, పాలు బాబు, వీఆర్వోలు, గణపతి, ఆనంద్ పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌పై రాళ్లు దాడి పోలీసుల వైఫల్యమే

అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : టీడీపీ అధినేత చంద్ర బాబు, జనసేనాని పవన్ కల్యాణ్‌పై వరుసగా రాళ్ల దాడి చేస్తున్నా ఏపీ ప్రభుత్వం నియంత్రించలేకపో తోందని అరకు కూటమి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత మండిపడ్డారు. అల్లరి మూకల్ని నియంత్రించడంలో పోలీసుల వైఫల్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వ శాంతి భద్రతల రక్షణ కల్పనలో వైఫల్యం చెందిందన్నారు. నాయకులు, బరిలో ఉన్న అభ్యర్థులకు, ప్రజలకు రక్షణ కల్పించలేని ఏపీ సీఎస్, డీజీపీని తక్షణమే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ వరుస సంఘ టనలపై ఎన్నికల కమిషన్ (ఈసీ) కూడా తక్షణమే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకో వాలన్నారు. భద్రతా వ్యవహారంలో ప్రజా స్వామ్యానికి విఘాతం కలిగించే చర్యల్ని సహించకూడదని కొత్తపల్లి గీత స్పష్టం చేశారు.

మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర - ముంచింగ్‌పుట్టు : అల్లూరి జిల్లా సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరుగనున్న సమయంలో ముంచింగి పుట్టు మండలం జోలపుట్ పంచాయితీ కేంద్రములో ఓ గోదాములో దాచి పెట్టిన మద్యం సీసాలు పెద్ద సంఖ్యలో ముంచింగిపుట్టు పోలీసులు పట్టు కున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్సీ దీరాజ్ సోమవారం స్థానిక విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని జోలాపుట్ పంచాయితీ కేంద్రంలో వారాలని మాణిక్యేశ్వరరావు అను వ్యక్తికి చెందిన గోదాములో పెద్ద సంఖ్యలో మద్యం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారంతో ఈ నెల 6వ తేదీన జి.మాడుగుల సిఐ రమేష్,ఎస్ఐ కె.రవీంద్రతో పాటు పోలీసులు వెళ్లి గోదాములో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గోదాములో అక్రమంగా నిల్వఉంచిన 113 కార్డు బోర్డ్ పెట్టెలు ఒక్కొక్క బాక్స్ లో 48 సీసాలు ఎండిపిఎస్ మద్యం, 180 ఎమ్ఎల్ ఎస్ఐఐక్స్ ప్రీమియం మాల్ట్ బ్లెండెడ్ విస్కీ బాటిల్స్, మొత్తం 5,424 బాటిల్స్ ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన మద్యం సీసాల విలువ సుమారుగా రూ.10,84,800లుగా తెలిపారు. గోదాములో అక్రమంగా నిలువ ఉంచిన గోదాము యజమాని వారాలని మాణిక్యేశ్వరరావును అరెస్టు చేసి ఎ1గా చేర్చి జ్యుడీషియల్ కస్టడీకి తరలించామని, ఎ2 నిందితుడు వారాలని జగదీష్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, త్వరలో పరారీలో నిందితుడిని అదుపులోకి తీసుకొని టామని ఎస్పీ దీరాజ్ తెలిపారు. త్వరలో జరిగే ఎన్నికల సమయంలో ఎవరైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే, ఎన్నికల నియామవళిని ప్రతి ఒక్కరు పాటించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని అల్లూరి జిల్లా ఎస్పీ ధీరజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిపోయిన విద్యుత్‌ను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - అనంతగిరి : నిలిచిపోయిన విద్యుత్‌ను పునరుద్ధరించాలని హుకుంపేట అనంతగిరి మండలాల సరిహద్దు గ్రామాలైన పట్టెడ దొడడ డెక్కపురం గ్రామాలకు రెండు వారాల నుండి విద్యుత్ సరఫరా కాకపోవడంతో ఆ రెండు గ్రామాల ప్రజలు తక్షణమే విద్యుత్తును పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చతీస్‌ఘడ్‌లో రెండు కార్లను దగ్ధం చేసిన మావోయిస్టులు

పోలీస్ క్యాంప్ పై మావోయిస్టుల దాడి

విశాలాంధ్ర - చింతూరు : ఈనెల 13 నుండి 15వ తేదీ వరకు చత్తీస్గడ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్ర రాష్ట్రాల్లో మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో బీజాపూర్ జిల్లా గొల్లపల్లి కిష్టరం రహదారిలో ప్రయాణిస్తున్న రెండు కార్లను మావోయిస్టులు దగ్ధం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో విలీన మండలాలకు చతిస్గడ్ కు సరిహద్దున ఉండటంతో పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చింతూరు నుండి భద్రాచలానికి సాయంత్రం 6:00 నుండి ఉదయం 6 గంటల వరకు రహదారి నీ దిగ్బంధం చేశారు. ఎటువంటి వాహనాలను తిరగనివ్వడం లేదు. ఇది ఇలా ఉండగా సోమవారం చత్తీస్ ఘడ్ బీజాపూర్ జిల్లాలోని చుట్వాహి లోని పోలీస్ క్యాంప్ పై మావోయిస్టు దాడి...పోలీస్ క్యాంప్ పై బాంబుల వర్షం కురిపిస్తున్న మావోయిస్టులు...తెలంగాణ చత్తీస్ ఘడ్ లో జరిగిన ఎన్కౌంటర్లకు నిరసనగా బంద్ నేపథ్యంలో..పోలీస్ క్యాంపు దాడిలో మావోయిస్టు అగ్ర నాయకులు పాల్గొన్నట్లుగా సమాచారం

మూగజీవాలకు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టండి

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహులు

విశాలాంధ్ర - చింతపల్లి : మూగజీవాలకు వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు వేస్తూ తగిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని అల్లూరి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సీహెచ్ నర్సింహులు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం అల్లూరి జిల్లాకు సంబంధించిన పశుసంవర్ధకశాఖ ప్రత్యేక సదస్సు నిర్వహించారు.. స్థానిక పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు పాడేరు, రంపచోడవరం, అరకు డివిజన్ల పరిధిలోని పశువైద్యాధికారులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి నర్సింహులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, పందులు, కోళ్లలో కాలానుగుణంగా పలురకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. మనుషుల మధ్య సంచరించే ఈ మూగజీవాల వల్ల మనుషులకూ అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఆంత్రాక్స్, బర్డ్ ఫ్లూ , స్వైన్ ఫ్లూ వంటివి ఈ కోవలోకే వస్తాయన్నారు. పశువులనుంచి ఈ వ్యాధులు రాకుండా జిల్లా వ్యాప్తంగా వాక్సినేషన్ జరుగుతుందన్నారు. తాజాగా పందులకు వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. పశుబీమా అమల్లో అల్లూరి జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇటీవల కాలంలో సుమారు 3244 మంది లబ్ధిదారులకు పశుబీమా. అందించామన్నారు. వ్యవసాయ సుబంధ పరిశ్రమగా పశువుల సంతతిని పెంచడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. పాలు, గుడ్లు, మాంసం, ఉన్ని వంటి విక్రయాలతో ఆదాయం పెంచు కునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పశుసంవర్ధకశాఖ అమలు చేసి ఉన్న పథకాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు షేక్ అహ్మద్ షరీఫ్, ఏడీ చంద్రశేఖరరావు, పశు వైద్యాధికారులు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ అప్పారావు పాల్గొన్నారు.

చిలకల గెడ్డ నుంచి కూటమి అభ్యర్థుల బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - అనంతగిరి : మండలంలో ముఖద్వారం అయినా చిలకల గెడ్డ నుంచి కూటమి అభ్యర్థుల బైక్ ర్యాలీ నేడు జరగనున్నట్లు అరకు పార్లమెంటరీ ఇంచార్జ్ శ్రావణ్ కుమార్ తెలిపారు. కాశీపట్నం గ్రామంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పొత్తులో భాగంగా ఎంపీ ఎమ్మెల్యే సీట్లను బీజేపీ పార్టీకు కేటాయించగా వాటి గెలుపుకు కూటమిలో ఉన్న తెలుగుదేశం పార్టీ భారతీయ జనతా పార్టీ జనసేన పార్టీలో నాయకులు కార్యకర్తలు అంతా కలిసికట్టుగా సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు అదేవిధంగా నేడు జరగనున్న ర్యాలీకి కూటమిలోని పార్టీల నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు అరకు లో కూటమి జెండా ఎగురవేయడమే ప్రతి ఒక్కరు లక్ష్యం కావాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రిగా చేసుకోవడమే తమ లక్ష్యం

సామూహికంగా రాజీనామాలు సమర్పించిన వాలంటీర్లు

విశాలాంధ్ర - చింతపల్లి : వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చిన వైయస్ జగన్మోహన్ రెడ్డిని రాబోవు సార్వత్రిక ఎన్నికలలో మళ్ళీ ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా పనిచేసేందుకు మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన వాలంటీర్లు సామూహికంగా రాజీనామాలు సమర్పిస్తున్నామని వాలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు వేములపూడి పరమేశ్వర రావు అన్నారు. వివిధ పంచాయతీల నుండి అధిక సంఖ్యలో స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న వాలంటీర్లు పరమేశ్వర రావు ఆధ్వర్యంలో ఆయా పంచాయతీల కార్యదర్శులకు, తద్వారా ఎంపీడీవో వీర సాయిబాబా కు మూకుమ్మడి రాజీనామాలు సమర్పించారు. ఈ సందర్భంగా పరమేశ్వర రావు మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చిన వైకాపా అధినేత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసుకునే వాలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని ఉద్దేశంతో పాడేరు నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వర రాజును ఎమ్మెల్యే గా, అరకు ఎంపీగా తనూజా రాణిని గెలిపించి వైయస్ జగన్మోహన్ రెడ్డికి బహుమతి ఇవ్వాలనే లక్ష్యంతో సుమారు 190 మందికి పైగా వాలంటీర్లు నేడు సామూహికంగా రాజీనామాలు సమర్పించడం జరిగింది. గడచిన ఐదేళ్లపాటు వాలంటీర్లుగా ప్రజలకు చేసిన నిస్వార్థమైన సేవతో సంతృప్తిగా ఉన్నామన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి తమ సేవలను ప్రజలకు అందించ కుండా ప్రతిపక్షాలు కుట్ర చేశాయని, ఈ విషయంలో తమ మనోభావాలు దెబ్బతిని న్యాయానికి, తమను వాలంటీర్లుగా గుర్తించిన వైయస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడమే ముఖ్య ఉద్దేశంగా ఎంచుకొని తామంతా మూకుమ్మడి రాజీనామాలు చేయడం జరిగింది దన్నారు. గడచిన ఐదేళ్ళ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో ఏ విధంగా శ్రమించామో ఆ విధంగా శ్రమించి పాడేరు ఎమ్మెల్యే అరకు ఎంపీ స్థానాలలో వైకాపా అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి వైయస్ జగన్మోహన్ రెడ్డికి బహు మతిగా ఇచ్చేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పంచాయతీలకు చెందిన వాలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీహెచ్‌సీల ద్వారా మెరుగైన వైద్య సేవలందించాలి

విశాలాంధ్ర - బెలగాం : గ్రామీణ ప్రజలకు పిహెచ్సి ల ద్వారా మెరుగైన వైద్య సేవలందించి, వారి ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) డాక్టర్ టి. జగన్ మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన సీతానగరం పిహెచ్సిని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు పరిశీలించారు. ఆసుపత్రికి వైద్యం కొరకు వస్తున్న వారి ఆరోగ్య సమస్యలను స్పష్టంగా తెలుసుకొని, వ్యాధి నిర్ధారణ ఖచ్చితంగా జరపడం ద్వారా, సరైన చికిత్స అందించవచ్చు అని తెలియచేశారు. జ్వర నిర్ధారణ పరీక్షల రికార్డులు తనిఖీ చేశారు. ఆసుపత్రిలో క్షేత్ర స్థాయిలో జ్వర లక్షణాలున్న వారిని గుర్తిస్తే తప్పనిసరిగా రక్తపూతలు (స్లైడ్స్) సేకరించాలని ల్యాబ్ టెక్నీషియన్, క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించారు. మందులు, వ్యాక్సిన్ నిల్వలు ఎప్పటికప్పుడు గమనించాలని, కాలపరిమితి దగ్గరగా ఉన్న మందులను ముందుగా వినియోగించాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగుల నిమిత్తం త్రాగునీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. వడదెబ్బ, వేసవి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన రహదారి కూడలికి ఆసుపత్రి సమీపంగా ఉన్నందున అత్యవసర చికిత్స ప్రాథమిక చికిత్స సిద్ధంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ అక్కడ ఆరోగ్య తనిఖీల కొరకు వచ్చిన రోగులు, గర్భిణీలతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని తగు సూచనలు చేశారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కృషి చేయాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ పి. పావని, సూపర్ వైజర్లు సత్యవతి, భవాని, శర్మ, వైద్య సిబ్బంది మురళీ, నిర్మల, వెంకటలక్ష్మి, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

18 ఏళ్ల లోపు బాలలను ఎన్నికల్లో ఉపయోగించరాదు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : ఎలెక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ వారి ఆదేశాల ననుసరించి, 18 ఏళ్ళ లోపు బాలలను రాజకీయ పార్టీలవారు గాని ఏ ఇతర కార్యక్రమాలలో గాని సార్వత్రిక ఎన్నికల కార్య క్రమాల్లో గానీ, ప్రచార పనులకు గానీ వినియోగించకూడదని కార్మిక శాఖ సహాయ కమీషనర్ కె.రామకృష్ణారావు తెలిపారు.బాలలను రాజకీయ కార్యకలాపాలకు వినియోగించుకొన్నచో బాల కార్మిక నిషేధ చట్టం ప్రకారం 6 నెలల జైలు శిక్షకు మరియు 50 వేల వరకు జరిమానాకు భాధ్యులగుదురని తెలిపారు. కార్మిక కమీషనర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విజయవాడ వారి ఆదేశముల ప్రకారం ఇంటర్ స్టేట్ మైగ్రేన్ట్ లేబర్ (ఇతర రాష్ట్రాలకు వలసపోయిన కార్మికులు) ను ముఖ్యంగా ఇటుక బట్టీలలో పనిచేసే అంతర్ రాష్ట్ర వలస కార్మికులను తమ ఓటు హక్కును వినియోగించుకొనుటకై వారి యొక్క రాష్ట్రంలోని స్వగ్రామాలకు తప్పనిసరిగా పంపించవలెనని, అటుల పంపించని యజమానులపై చట్టరీత్యాచర్యలు తీసుకొన బడునని తెలియజేసారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన కెజిబివి ప్రిన్సిపాల్‌కి ఘన సన్మానం

విశాలాంధ్ర - కురుపాం : ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలు లో ఉత్తమ ఫలితాలు సాధించిన కురుపాం కస్తూరిబా బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ బి.కిరణ్ కుమారిని జిసిడిఓ రోజా రమణి,డిఇఓ పగడా లమ్మ, తోటి ప్రిన్సిపాల్లు, సర్వశిక్షా అభియాన్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ ఏడాది కెజిబివి లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం శతశాతం ఉత్తీర్ణత సాధించగా అక్కెన లక్ష్మి ప్రసన్న 962/100మార్కులు సాధించారు అలాగే మొదటి సంవత్సరం 96.36 శాతం ఉత్తీర్ణత సాధించగా దత్తి మల్లిక 440/ 470అత్యధిక మార్కులు సాధించింది.క్రమశిక్షణ తో కూడిన విద్య అందించి ఉత్తమ ఫలితాలు సాధించిన కురుపాం ప్రిన్సిపాల్, విద్యార్థులు లక్ష్మి ప్రసన్న,మల్లిక లను అభినందించారు. శతశాతం ఉత్తీర్ణత, అధిక మార్కులు స్కోర్ చేసేందుకు అన్ని కెజిబివిలలో కృషి చేయాలని సూచించారు.

అర్ధరాత్రి వాహనాలను తనిఖీలు చేసిన ఎస్ఐ రాజేష్

విశాలాంధ్ర - సీతానగరం : జిల్లా జిల్లా ఎన్నికల అధికారయిన జిల్లా కలెక్టరు,జిల్లా ఎస్పీ అదేశాల మేరకు వాహనాలను ముమ్మరంగా తనిఖీచేస్తున్నట్లు ఎస్సై ఎం రాజేష్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలనుంచి ఉదయం 6గంటల వరకు స్పెషల్ పార్టీ హనుమాన్ కూడలివద్ద వాహనాలను తనిఖీలను నిర్వహించినట్లు చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలన్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళి తూచ తప్పకుండా పాటించాలని తెలియజేస్తూ వాహనదారులకు వివరిస్తున్నారు. ఇదిలా ఉండగా మండల ఎన్నికల ప్రవర్తన నియమావళి అధికారులు,ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు(ఎఫ్. ఎస్ టి బృందాలు) కూడా ముమ్మరంగా తనిఖీలను చేస్తున్నారని ఆయన చెప్పారు.దీన్నాయి ఆధ్వర్యంలో ఒక టీం,మరోటీ ఆధ్వర్యంలో మరో టీమ్ మండల కేంద్రంలో ఉంటూ ముమ్మరంగా తనిఖీలను చేస్తున్నారు. సి విజిల్ పిర్యాదులు కూడా పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు.ఇదిలా వుండగా జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు మేరకు పార్వతీపురం ఆర్ ఓ ఆదేశాలు సూచనలు మేరకు తనిఖీలు ముమ్మరంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుకు తగు చర్యలు తీసుకుంటున్నారు.24గంటలపాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పరిశీలన చేస్తూ వాహనాల తనిఖీలు, ఎన్నికల ప్రచారాన్ని టీములు దగ్గరుండి రికార్డింగ్ చేయడం తదితర కార్యక్రమాలని మండల స్థాయిలో ఎంపిడిఓ ఈశ్వరరావు అధ్యక్షతన మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కూడలివద్ద శ్రీనివాసరావు, ఎస్ఐ రాజేష్ లు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రతీ రోజు పార్వతీపురం ఆర్ ఓ ఆర్డీఓ హేమలత ఇస్తున్న ఆదేశాలు, సూచనలు సలహాలు పాటిస్తూ విధులు సక్రమంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మండల స్థాయిలో ఉండే సెక్టోరియల్ అధికారులు కూడా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల సందర్శన, వారికి ఎన్నికల సమాచారాన్ని తెలియజేస్తున్నారు.

వాహనం అదుపు తప్పి.... ముగ్గురుకి గాయాలు

విశాలాంధ్ర - కురుపాం : ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముగ్గురు యువకులు గాయపడిన ఘటన సోమవారం మధ్యాహ్నం మండలంలోని చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం పి.టి.మండ గ్రామానికి చెందిన యువకులు గుంపస్వామి, దిలీప్, వేణు ముగ్గురు కలిసి ఒక ద్విచక్ర వాహనంతో పెళ్లివసలలో ఓ పంక్షన్ కి వెళు ఎదగా ప్రమాదవశాత్తు పెళ్లివసల జంక్షన్ సమీపంలో అదుపుతప్పి బైక్ బోల్తాపడింది. దీంతో ముగ్గురు గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను కురుపాం సీహెచ్సీకి తరలించి, చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

తేదేపాలో చేరికలు

విశాలాంధ్ర - సాలూరు రూరల్ : మండలం లో నెలిపర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాపాక.అప్పమ్మ,మాజీ వార్డ్ మెంబర్ లింగాల.విజయ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు వైకాపా ను వీడి సోమవారం తెదేపా లో చేరాయి. మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల.పరమేష్ ఆధ్వర్యంలో వీరంతా టిడిపి లో చేరారు. తెదేపా, జనసేన, భాజపా కూటమి అభ్యర్థి గుమ్మిడి. సంధ్యారాణి తన నివాసంలో వీరందరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సంధ్యారాణి, చంద్రబాబు పై నమ్మకం తో పార్టీలో చేరుతున్నామన్నారు.వచ్చే ఎన్నికల లో తెదేపా విజయానికి కృషి చేస్తామన్నారు. నెలిపర్తి పంచాయతీలో కూటమి అభ్యర్థికి భారీ మెజారిటీ వచ్చేలా తామంతా పనిచేస్తామన్నారు.సంధ్యారాణి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత మైన స్థానం కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమం లో నెలిపర్తి కి చెందిన ఎక్కుడు.గణపతి, బంగారి, లింగాల. గాంధీ,సురేష్, తెదేపా సీనియర్ నాయకులు మత్స.శ్యాం సుందర్, కరిబుగ.భాస్కర్, ఆముజూరి.శ్రీనివాస్, బాలాజీ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

ఐటిఐ ప్రిన్సిపల్ గోపాలకృష్ణ

విశాలాంధ్ర - సీతంపేట : ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. జెమ్స్ ఆసుపత్రి సిబ్బంది వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో ఐటిఐ విద్యార్థులు మరియు సీతంపేట వైటీసీ విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. వీరిని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. గోపాలకృష్ణ అభినందించారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు రక్షించడానికి దానం చేసే రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని ఐటిఐ ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైటీసీ స్టాఫ్, జెమ్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు సరఫరాకు ప్రత్యేక శ్రద్ధ

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం మన్యం జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు తెలిపారు. తాగునీటిపై వివిధ పత్రికలలో ప్రచురితమైన వార్తలపై ప్రభాకర రావు స్పందిస్తూ తాగు నీరు సరఫరాకు ఇబ్బందులు రాకుండా నీటి సరఫరా పథకాలు, బోరు బావులకు వెంటనే మరమ్మత్తులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జల జీవన్ మిషన్ పనులు జరుగుచున్నాయని, పనులు పూర్తయిన వెంటనే తాగు నీరు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

రావుపల్లి సచివాలయం వాలంటీర్ల రాజనామా

విశాలాంధ్ర - గరుగుబిల్లి : మండల పరిధిలోని రావుపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని వాలంటీర్లు రాజీనామా చేస్తూ సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి పైల సూర్య నారాయణకు తమ రాజీనామా పత్రాలను అందజే శారు. ఈమేరకు రావుపల్లి సచివాలయం పరిధిలోని 16 మంది వాలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. రావుపల్లి సచివాలయం పరిధిలోని వాలంటీర్లు రంభ శరత్ కుమార్, చింతాడ ఉష, చింతాడ రవి, మెండి పార్వతమ్మ, పువ్వు సింహాచలం, పట్టి కోళ్ళ భవాని, గుగ్గర అనూష, గడిదేసి ఉమామహేశ్వరి ,బోను హేమ, చింతల జ్యోతిర్మయి, షేక్ రహీనా, గుంట్రెడ్డి అప్పలనా యుడు, మర్రాపు నాగేశ్వరరావు, గోపిశెట్టి రవి, మర్రాపు నవీన్, బోను దీప్తిలు వాలంటీర్లకు రాజీనామా చేస్తూ తమ రాజీనామా పత్రాలను అంద జేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రతిపని విషయంలోనూ సేవ చేయడం జరిగిందన్నారు.

గురుకులం మిగిలిన సీట్లకు ఈ నెల18, 19 తేదీల్లో కౌన్సిలింగ్

విశాలాంధ్ర - సీతానగరం : విజయనగరం,పార్వతీపురం మన్యం జిల్లాలలోని డా.బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 2024-2025 విద్యా సంవత్సరంనకుగాను 5వ తరగతినందు చేరుటకు మిగులు సీట్లకు ఈనెల 18,19 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, విజయనగరంపార్వతీపురం మన్యం జిల్లా జిల్లా సమన్వయకర్త టి.పద్మజ తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకుమొదటిలిస్టులో సీట్లు కేటాయించగా పరీక్షవ్రాసి ఎంపికకాబడని మిగిలిన సీట్లకు ఎంట్రన్స్ పరీక్ష వ్రాసిన విద్యార్థుల మెరిట్ లిస్టు ప్రకారం మిగులు ఖాళీలకు బాలురకు ఈనెల 18న కొప్పెర్ల డా.బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బాలికలకు ఈనెల19నచీపురుపల్లి డా.బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలందు కౌన్సిలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించబడునని తెలిపారు. మెరిట్ లో ఉండి గతంలో కౌన్సిలింగ్ కు హాజరు కాని విద్యార్థులు హాజరు కావాలని కోరారు.మెరిట్ లిస్టులో ఉన్న విద్యార్థులకు మొబైల్ ఫోన్లకు మెసేజ్ పంపినట్లు తెలిపారు. మిగులు సీట్ల కౌన్సిలింగ్ పాతజిల్లా ప్రాతిపదికన జరుగుతుందన్నారు. కావున విద్యార్థిని విద్యార్థులు తమ యొక్క ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రంతో కౌన్సిలింగ్ జరిగిన పాఠశాలకు ఉదయం తొమ్మిది గంటలకు రావాలని కోరారు. ఉదయం 10తర్వాత హాజరైన విద్యార్థిని విద్యార్థులకు కౌన్సిలింగ్ కు అనుమతించబడదని విజయనగరం పార్వతీపురం మన్యం జిల్లా సాంఘిక సంక్షేమ డా.బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా సమన్వయాధికారి శ్రీమతి టి. పద్మజ తెలిపారు. మరింత సమాచారం కొరకు బాలికలు 8333033434 ఫోన్ నంబరుకు, బాలురు 6303887657 నెంబర్లకు సంప్రదించవలెనని చెప్పారు. ఎంట్రన్స్ పరీక్ష వ్రాయని విద్యార్థులకు సీట్లు ఇవ్వబడవని చెప్పారు.

సీఎం జగన్ పై దాడి దురదృష్టకరం

ఎంపీటీసీ రామిరెడ్డి

విశాలాంధ్ర - ఎటపాక : సిఎం జగన్ పై దాడి దురదృష్టకరమని గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట రామిరెడ్డి ఖండించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జనహృదయనేత వైయస్ జగన్మోహన్ రెడ్డిపై విజయవాడలో జరిగిన దాడిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎటపాక మండల గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి తీవ్రంగా ఖండించారు. 2024 ఎన్నికల రణరంగంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కోవడానికి చేతకాక ఇలాంటి దుర్మార్గపు చర్యలకు ప్రతిపక్ష కూటమి దారుణమైన దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సరైనవి కావని ఆయన తెలిపారు. అంతేకాదు జగన్మోహన్ రెడ్డి కి కొన్ని లక్షల తల్లుల ఆశీర్వాదం ఉందని, పెను ప్రమాదం నుండి బయటపడ్డారు. దోషులు ఎవరైనా సరే పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

మేమంతా సిద్ధం...ఎన్నికల ప్రచారం ప్రారంభం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని రామవరం గ్రామపంచాయతీ సోముల గూడెం గ్రామంలో ఎమ్మెల్సీ అనంత బాబు ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆదేశాల మేరకు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన వైయస్సార్సీపి మండల కమిటీ. సోమవారం ప్రారంభించారుఈ సమావేశానికి పంచాయతీ పరిధిలోని రామవరం, చొప్పలి, లక్ష్మీనగరం, సోముల గూడెం, అడవి వెంకన్న గూడెం గ్రామాల ముఖ్య కార్యకర్తలు సచివాలయ కన్వీనర్ లు గృహ సారదులు హాజరు కాగా ఈ సమావేశాన్ని ఉద్దేశించి మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు, జెసిఎస్ మండల ఇంచార్జి బొడ్డు సత్యనారాయణ లు మాట్లాడుతూ మండలంలో మీ గ్రామంలో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టామని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీరంతా రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డినీ మళ్ళీ ముఖ్యమంత్రి చేసేందుకు, రంపచోడవరం నియోజకవర్గ లో ఎమ్మెల్యే గా మళ్ళీ నాగులపల్లి ధనలక్ష్మి ని భారీ మెజారిటీ తో గెలిపించేందుకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు, గడిచిన ఈ అయిదు సంవత్సరాల కాలం లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని మళ్ళీ ముఖ్యమంత్రి గా జగన్మోహన్ రెడ్డి వస్తే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందనీ మీరంతా ఫ్యాన్ గుర్తు పై మీ అమూల్యమైన ఓటు వెయ్యాలని ప్రజలు చెప్పాలని వారన్నారు, ఈ కార్యక్రమంలో మండల వైస్ కన్వీనర్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిషన్ సభ్యులు చిక్కాల బాలు, సొసైటీ చైర్మన్ ముత్యాల మురళి, చిన మట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, మండల నాయకులు. ముత్యాల గౌతమ్, వైఎస్ కన్వీనర్ మాడి ముత్యాలరావు, మామిడి రాజు, కోటం జాయిరాజు, మామిడి బాలాజీ, మోడెమ్ సరేష్,పట్టీల సీతయ్య, సచివాలయ కన్వీనర్ లు ముత్యాల శ్రీధర్,సోడి రాజబాబు, ఆసు లక్షమన్, అది సాయి, స్థానిక కార్యకర్తలు కుంజ జానకిరావు, మడకం రాముడు,ముత్యాల జైరాజు సోడి రంగారావు, కాపారపు నాగు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల దాడుల్లో పలువురి గిరిజనులకు గాయాలు

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు : అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోగల మారుమూల పంచాయతీ లక్ష్మీపురం పరిధిలో గల సుత్తి గూడ గ్రామ గ్రామస్తుడు గిర్లియా బలబద్రుడు అనే పసుపు వ్యాపారిని గంజాయి వ్యాపరస్తుడిగా అనుమానించి అను మానంతో ఆదివారము రాత్రి తమ ఇళ్లల్లో చొరబడి ఓ గిరిజన మహిళతో పాటు ముగ్గురు గిరిజనులపై స్థానిక ఎస్ఐ, పోలీసు సిబ్బంది అకారణంగా చేసిన దాడిలో గిరిజనులు తీవ్ర గాయాలు పాలైన సంఘ టన చోటు చేసుకుంది అల్లూరి సీతా రామరాజు జిల్లా ముంచింగిపుట్టు మండలం అత్యంత మారుమూల గిరిజన గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి దాడికి గురి అయిన బాధితులు స్థానిక విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం మారుమూల లక్ష్మీపురం పంచాయతీ సుత్తి గూడ గ్రామానికి చెందిన గిర్లి యా బాల భద్రుడుఇంట్లో అర్ధరాత్రి 11 గంటల సమయంలో భార్యాబిడ్డలతో నిద్రిస్తున్న సమయంలో ముంచింగిపుట్ఎస్సై కే రవీంద్ర తన సిబ్బందితో లారీలో గంజాయి లోడు చేస్తున్నట్లు పక్క సమాచారంతో మా ఇంట్లో చొరబడి అకారణంగా తీవ్ర గాయాలు చేస్తున్న సమయంలో ఎందుకు నా భర్తను ఏ కారణం చేత కొట్టుచున్నారని అడ్డుకోడానికి వెళ్ళిన దేవి నిమహిళ అని కూడా చూడకుండా దురుసుగా ప్రవర్తించి నెట్టి వేయడంతో తోదేవి స్పృహ కోల్పోయి కింద పడిపోయారు.బలబద్రుడు గత కొన్ని సంవత్సరాలుగా పసుపు వ్యాపారం చేసుకొనుచున్నాను. 54 బస్తాల పసుపు కొనుగోలు చేసి ఆరబెట్టిన పసుపు కొమ్ములను దుంపలను వేరుచేసేసమయాలు చీకటి పడిపోవడంతో ముగ్గురు పని వారితో పాటు నేను నా కుటుంబ సభ్యులు ఇంటి ఎదురుగా పసుపు కొమ్ములు దుంపలను విడిచిపెట్టి గృహంలోనినిద్రిస్తున్న సమ యంలో అటత్తుగా ఒక్కసారిగా పోలీసులు గృహంలో చొరబడి ఆ కారణంగా నన్నును దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఫిర్యాదు చేయనున్నట్లు బలబద్రుడు తెలిపారు. ఈ విషయంపై స్థానిక విలేకరులు ముం చింగిపుట్ ఎస్సై కె .రవీంద్ర వివరణ కోరగా సుత్తి గూడ వెళ్లిబలబద్రుని ఇంట్లో తని ఖీలు చేయడం వారి పై దాడి చేయడం వాస్తవమేనని ఎస్సై రవీంద్ర వివరణ ఇచ్చారు.

అభిప్రాయం

సుత్తి గూడ గ్రామానికి చెందిన గిర్లియ బాలబద్రుడు పసుపు వ్యాపారి అమాయక గిరిజనులపై అర్ధరాత్రి సమయంలో దాడులు చేయటం చాలా బాధాకరమని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కే త్రినాథ్ అన్నారు. గిరిజన ప్రజలకు న్యాయం చేసే పోలీస్ శాఖ అధికారులే ఇలాంటి దాడులకు పాల్పడితే ఎలా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ వారు మారుమూల ప్రాంతం గిరిజనులపై దాడులను పునరుత్వం కాకుండా చూసుకోవాలని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కొర్ర త్రినాథ్ కోరారు.

ఆటో ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - సీలేరు : సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో ప్రమాదానికి గురైన సంఘ టనలో ఒకరు చికిత్స పొందుతూ సోమవారం కేజీహెచ్‌లో మృతి చెందారని, దీనిపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీలేరు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాలికొండ పంచాయతీ సప్పర్ల నుంచి ఆకులూరు గ్రామానికి గత శనివారం సిమెంట్ రోడ్డులో వెళ్తున్న అశోక్‌లేలాండ్ దోస్త్(ఆటో) వాహనం ఆకులూరు సమీపంలో గల ఘాట్‌లో అదుపు తప్పి 10 అడుగుల లోయలోకి పడిపోయింది. దీంతో వాహనం వెనుక తొట్టిలో ఉన్న పనసలబంద గ్రామా నికి చెందిన పాంగి సన్యాసిరావు, వంతల రమేష్, పాంగి బాబి, వంతల రవి, డ్రైవర్ గుంగుల నాయుడుకి స్వల్ప గాయాలు అవగా పనసలబంద గ్రామానికి చెందిన వంతల సన్యాసిరావుకు తీవ్ర గాయాలు తగలడంతో సప్పర్ల పిహెచ్‌సిలో ప్రధమ చికిత్సను చేసి విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని, దీనిపై సీలేరు పోలీస్‌స్టేషన్ లో శనివారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు.

కోడికత్తి డ్రామాకు సీక్వెల్ 'గులక రాయి దాడి'

విశాలాంధ్ర - దేవీపట్నం : కోడికత్తి డ్రామా మాదిరిగానే గులకరాయి దాడి జరిగిందని ఈ గులకరాయి దాడి నెపంతో ప్రజల్ని మభ్య పెట్టాలనుకుంటే కాలం చెల్లిన డ్రామాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని టిడిపి రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు జె.ఎస్.నగేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ ఎన్నికల ప్రచారానికి ప్రజల స్పందన తగ్గటం తో కోడికత్తి డ్రామా మాదిరిగా, మళ్ళీ కొత్త డ్రామాలకు తెరలేపారన్నారు. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన జరుగుతుంటే, కరెంట్ తీసేయడమా...? ఇది ముందుగా వేసుకున్న పథకంలో భాగం కాదా? అని నగేష్ ప్రశ్నించారు .ఇది కేవలం ఉద్దేశపూర్వకంగా చేయించుకున్న దాడే...తప్పా మరొకటి కాదన్నారు.ఇది కొంత మంది అధికారుల నేతృత్వంలో రూపొందించిన డ్రామాగా, తేట తెల్ల మవుతుందన్నారు. 2019లో విశాఖ ఎయిర్ పోర్ట్ లో జరిగిన కోడికత్తి డ్రామాకు ఇది గులకరాయి దాడికి పెద్ద తేడా ఏమీ లేదన్నారు. ఘటన జరిగిన నిమిషాల వ్యవధిలోనే పేర్ని నాని, అంబటి రాంబాబు లాంటి వారు ,క్షణాల్లో లైన్లోకి వచ్చి ఇదంతా టీడీపీ చేయించిందని, నీలి మీడియాలో ప్రచారం చేయడం చూస్తే, ఈ దాడి ఘటన ముందస్తు ప్రణాళికలో భాగం కాదా? అని నగేష్ అన్నారు.ఎన్ని నాటకాలు ఆడినా ఇప్పటికే ప్రజలు మిమ్మల్ని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని నగేష్ అన్నారు.

నాటు సారాతో ఇద్దరు వ్యక్తుల అరెస్టు

విశాలాంధ్ర - చింతపల్లి : మండలంలోని అన్నవరం పోలీసు స్టేషన్ పరిధిలో 30 లీటర్ల నాటుసారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్సై రాజారావు తెలిపారు. సోమవారం ఆయన అందించిన వివరాల ప్రకారం అన్నవరం పంచాయతీకి చెందిన సోమవరం గ్రామానికి చెందిన వంతల రాజారావు అనే వ్యక్తి నాటుసారా తయారు చేస్తుంటాడని, ఆ నాటుసారాను అన్నవరం గ్రామానికి చెందిన సొంటెల శివ అనే వ్యక్తి కొనుగోలు చేసి విక్రయాలు చేస్తుంటాడని వెల్లడించారు. ఈ మేరకు తమకు ముందుగా అందిన సమాచారంతో తమ సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు నాటుసారాతో పట్టుబడ్డారని, వారి వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, వారిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నాటుసారా తయారీ, క్రయ విక్రయాలు, గంజాయి అక్రమ రవాణా నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని, ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజారావు హెచ్చరించారు.

వడగాల్పులు, ఎండ తీవ్రతకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - చింతూరు : విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో చింతూరు మండలంలో రోజు ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చ రించిందనీ ఎండ తీవ్రత పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని తాసిల్దార్ నాజీముల్లాషా ఒక పేర్కొన్నారు. ప్రజలు వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు ఎండలో బయటకు వెళ్ళటం తగ్గించండి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్ళాల్సి వస్తే తలకి టోపి పెట్టుకోవాలి లేదా రూమాలు కట్టుకోవాలి. గొడుగును ఉపయోగించాలి. ఎక్కువగా మంచినీరు, మజ్జిగ, గ్లూకోజు, నిమ్మరసము, కొబ్బరినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీటిలో కలుపుకొని త్రాగవలెనని సూచించారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

పరగసానిపాడులో వాహనాల తనిఖీ

విశాలాంధ్ర - దేవీపట్నం : మండలంలోని ఇందుకూరుపేట -గోకవరం ప్రధాన రహదారి లో పరగ సాని పాడు కాలనీ వద్ద దేవీ పట్నం స్టేషన్ ఎస్సై కెవి నాగార్జున వాహన తనిఖీ లను సోమవారం చేపట్టారు. ఈ సంద ర్భంగా అధిక సంఖ్య లో ఆటోలో ప్రయాణం చేస్తున్న వాహన దారులకు ప్రయాణీకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అదే విధంగా నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలకు జరిమానా లు విధించారు. ప్రయా ణాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారులదే పూర్తి బాధ్యత

రిటర్నింగ్ అధికారి కల్పన కుమారి

విశాలాంధ్ర- సీతంపేట : పోలింగ్ రోజు ప్రిసైడింగ్ అధికారు లదే పూర్తి బాధ్యత అని పాలకొండ నియోజకవర్గ రిట ర్నింగ్ అధికారి కల్పన కుమారి అన్నారు. సోమవారం నియోజక వర్గంలోని ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇస్తోన్న శిక్షణా తరగతులను ఆర్వో పరిశీలించారు. ఈ సంధర్బంగా ఆర్వో మాట్లా డుతూ పోలింగ్ రోజు పీవో, ఏపీవోలు చేపట్ట వలసిన విధు లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. శిక్షణలో ప్రతీ యొక్క అంశాన్ని తెలుసుకోవాలని అన్నారు. పోలింగ్ రోజు నివేది కలు ఇచ్చే ఫారంలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. ఈవీయం యంత్రాల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పోలింగ్ రోజు నిర్దిష్ట సమయానికి పోలింగ్ ప్రారంభ మయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్య క్రమంలో తహశీల్దార్లు, మాస్టర్ ట్రైనీలు, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రాగునీరు సమస్య రాకుండా చూడాలి

విశాలాంధ్ర - జీకే వీధి : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు ఆధ్వ ర్యంలో పంచాయతీ సెక్రెటరీతో రివ్యూ సమా వేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండలంలో త్రాగు నీరు సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబం ధిత సిబ్బందిని కోరారు. గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్న వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని పంచాయతీ సెక్రెటరీలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇవాల్టి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర - బెలగాం : ప్రమాదాలు సంభ వించినపుడు తీసు కోవలసిన జాగ్రత్తలు, అగ్ని ప్రమా దాలను సమర్థ వంతంగా ఎదుర్కో నేందుకు పార్వతీపురం అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ పి. పైడిరాజు ఆధ్వర్యంలో సోమవారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ రకములైన అగ్నిప్రమాదాలు సంభవించే వేళ తీసుకోవాల్సిన నివారణ చర్యలపై, గ్యాస్, ఎలక్ట్రికల్ వలన కలిగే అగ్నిప్రమాదాల గురించి ప్రయాణీకులకు అవగాహన కల్పించే విధంగా తన సిబ్బందితో ఫైర్ డెమో నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను, నివారణ చర్యలను వారికి ఫైర్ డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది , ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణీకులు పాల్గొన్నారు.

టీడీపీ టికెట్ వంతల రాజేశ్వరికి ఇవ్వాలి

విశాలాంధ్ర - గంగవరం : రంపచోడవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ టికెట్ను మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జ్ వంతల రాజేశ్వరికి ఇవ్వాలని గంగవరం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడును కోరారు. గత ఐదేళ్లుగా పార్టీ కోసం రాత్రనకా పగలనకా కష్టపడి పని చేసిన రాజేశ్వరిని కాదని ఎవరికీ తెలియని మిరియాల శిరీష కు టికెట్ ఇవ్వడం పట్ల చంద్రబాబు నాయుడు పునర్ ఆలోచించాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా జడేరులో పార్టీ ముఖ్య నేతలు అత్యవసర సమావేశం నిర్వహించారు. మిరియాల శిరీషకు టికెట్ ఇవ్వటం పట్ల పార్టీ మొత్తం అయోమయంలోకి వెళ్లిపోయిందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ అనంత బాబును ఎదుర్కొనే సత్తా ఒక్క రాజేశ్వరకే ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గున్న రాష్ట్ర రైతుఅధికార ప్రతినిధి శ్రీ. కనిగిరి రాంబాబు గారు, మాజీ ఎంపీపీ . తీగల ప్రభ, ఎంపీటీసీ పండ. ఆదినారాయణ , సర్పంచ్ కలుముల అక్కమ్మ, మాజీ ఎంపీటీసీ .కోసు బుల్లియమ్మ, మాజీ సర్పంచ్ శ్రీమతి. నరిసి సూరమ్మ, మహిళా సంఘము ప్రెసిడెంట్ పొత్తూరి. అమ్మాజీ, ఆరుకు పార్లమెంట్ ఎస్టీ సెల్ కార్యదర్శి, పల్లాల వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు బండి. చినవెంకట రమణదొర, మామిడి. అబ్బాయి రెడ్డి, పల్లాల వీరభద్రరెడ్డి, అలమండ. సన్యాసి రావు, బొట్ట కృష్ణ, అర్జున్, ఎం.రాములుదొర, మడకం. రామారావు దొర, సిహెచ్ ఋషువ, మడకం. బుధమ్మా, నర్సి. లక్ష్మి, పండు దొర, కంగాల. వెంక్కన్న దొర, రాముడ్డి, పి.బుల్లాబ్బాయి జి.నాగేశ్వరావు, మడకం. సత్తిబాబు యాట్ల చిన్నరెడ్డి, సారిక. అప్పారావు, వీర్ల. లోకారెడ్డి, మడకం. లక్ష్మి, పిపెద్దబాబు, దొర, దాని. చెల్లా రెడ్డి, మడకం. సత్తిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరంతర పటిష్ట నిఘా ఉండాలి

విశాలాంధ్ర - కొమరాడ : సాధారణ ఎన్నికల దృష్ట్యా ఆంధ్రా ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లు వద్ద నిరంతర పటిష్ట నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం కొమరాడ మండలం కోనేరు చెక్ పోస్ట్ ను కలెక్టర్ తనిఖీ చేశారు. చెక్ పోస్టుల వద్ద కేసుల నమోదు, నగదు, వాహనాలు సీజ్ చేసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నగదు తరలించకుండా 24 గంటలు నిరంతర పటిష్ట నిఘాను పెట్టాలని సూచించారు. చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా చెక్ పోస్ట్ తనిఖీలను కంట్రోల్ రూమ్ నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. చెక్ పోస్టుల నుండి సీసీ కెమెరాలు పని తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విధమైన ఉదాసీనతను ప్రదర్శించిన సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. ప్రజలు తమతో పాటు తీసుకువెళ్ళే నగదు, బంగారం, ఆభరణాలు వంటి వాటికి విధిగా ఆధారాలు కలిగి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మద్యం, మాదక ద్రవ్యాలు రవాణాపై గట్టి నిఘా ఉండాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఆర్ రమేష్ ఎంపీడీవో ఎం మల్లికార్జున రావు ఎస్సై కే నీలకంఠం ఆర్ ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మూగబోయిన సెల్ టవర్లు..వినియోగదారులు గగ్గోలు

విశాలాంధ్ర - దేవీపట్నం : మండల కేంద్రమైన ఇందుకూరుపేటలో సెల్ టవర్లు పనిచేయక సెల్ ఫోన్ లు మూగ నోములు నోస్తూ వినియోగదారులను మౌన మునీంద్రులను చేసు న్నాయి. ఇందుకూరుపేట చుట్టు ప్రక్కల గ్రామాలకు కూడా ఇదే టవర్ మనుగడలో ఉండటంతో జనం గగ్గోలు పెడుతున్నారు. ఏజన్సీ లో ప్రజల కమ్యూనికేషన్ సౌలభ్యం కోసం గిరిజనాభివృద్ధి సంస్థ సుమారు 400జియో టవర్ల ఏర్పాటుకు జియో తో ఒప్పంధాలు కుదుర్చుకొని ఇప్పటికే చాలా చోట్ల జియో టవర్ల ఏర్పాటు చేస్తున్నారు అయితే గత నెల్లాల్లుగా ఇందుకూరు పేట లో జియో టవర్ పనిచేయక పోవటంతో దీని పై ఆధార పడ్డ గ్రామాల్లో జియో వినియోగదారులకు సేవలు అక్కరకు రాక వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో ఇదే ఇందుకూరు పేట లో బి ఎస్ ఎన్ ఎల్ కు చెందిన సెల్ టవర్ ఉండగా పూర్తిగా నిర్లక్ష్యం నీడన చేరి మనుగడ కోల్పోయింది. ప్రస్తుతం అందరు జియో సేవల పైనే ఆధార పడగా ఆ జియో సేవలు ప్రజలకు అంతంత మాత్రంగా అండటంతో వేరే నెట్ వర్క్ లోకి వెళ్లలేక జియో సేవలు అందక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆయా నెట్ వర్క్ సంస్థలు ప్రజల అవసరాలకు అనుగుణంగా తమ సేవలను విస్తృత పర్చాలని ప్రజలు కోరుతున్నారు.

పక్షం దాటినా పేదల కందని రేషన్ బియ్యం

నాసి రకం కందిపప్పు సరఫరా.... ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

విశాలాంధ్ర - దేవీపట్నం : దారిద్ర్య రేఖ కు దిగువన రెక్కాడితే గాని డొక్కాడని ప్రజలు పెరిగిన నిత్యావసరాల ధరలతో కడుపు నింపుకోవాలంటే ప్రభుత్వం ఇచ్చే బియ్యం కోసం ఎదురుతెన్నులు చూడక తప్పని పరిస్థితి.అయితే నెలలో ఇరవై రోజులు వస్తున్నా బియ్యం అందని పరిస్థితి. పౌర సరఫరాల శాఖ ద్వారా ఏజన్సీ లో గిరిజన సహకార సంస్థ ద్వారా అందించే ఈ బియ్యం సరఫరా ఏ నెలల్లోను అనుకున్న సమయానికి ప్రజలకు అందించిన దాఖలాలు లేవు. పేరుకే చౌక ధరలకు ఇచ్చే సరుకులే గానీ ఏ సరుకు నాణ్యమైంది కాదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిత్యావసర సరుకుల్లో బియ్యంతో పాటు పంచదార వంట నూనె గోధుమలు కందిపప్పు వంటివి సరఫరా చేసేవారు. ఇప్పుడు అన్నీ కాకపోయినా కందిపప్పు బియ్యం పంచదార తో కలిపి ఇస్తుండగా పంచదార కొలత కు రాదు కందిపప్పు పురుగులు పట్టి పూర్తిగా నాసి రకం నాన్యత లేకుండా ఉండటం ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదీ కూడా చౌక ధరల దుకాణం లో చౌకగా వస్తున్నాయా అంటే డిపోలో డీలర్లు బయట అమ్మే రేటులు కు ఐదు రూపాయలు తగ్గి అందిస్తున్నారు. తీరా కందిపప్పు ప్యాకెట్ విప్పితే పురుగులు పట్టి ఉంటుంది. ఇది ప్రభుత్వం ప్రజలకు సబ్సిడీ కింద ఇచ్చే నిత్యావసర సరుకులు. ఒకప్పుడు నాణ్యత తో ప్రజల అవసరాలకు అనుగుణంగా నిత్యావసరాలను లాభాపేక్ష లేకుండా గిరిజనులకు నిత్యావసరాలు అందించిన గిరిజన సహకార సంస్థ ఇప్పుడు స్వలాభమే పరమావదిగా పనిచేస్తోందని విమర్శలు మూట గట్టుకుంటుంది. ఆ సంస్థ లో పనిచేసే డీలర్లు సైతం అక్రమాలకు పాల్పడుతూ అటు సంస్థ కు ఇటు ప్రజలకు సేవా దృక్పధం లేకుండా స్వలాభమే స్వకార్యంగా పనిచేస్తున్నారు. ఇప్పటికైనా సంస్థాగతంగా మార్పులతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జి సి సి సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం

విశాలాంధ్ర - గరుగుబిల్లి : ప్రజల్లో మరింత భక్తి భావం పెంపొంది ంచేందుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం అభినం దనీయమని మండల పరిధిలోని దలాయివలస గ్రామ పంచాయతీ సర్పంచ్ గులిపల్లి నారాయణమ్మ అన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్తు విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మనగుడి కార్యక్ర మంలో భాగంగా మండల పరిధి లోని దళాయివలస గ్రామంలోని రామాలయంలో జరుగుతున్న శ్రీమద్రామాయణ ప్రవచన సప్తహ కార్య క్రమంలో భాగముగా ఆదివారం రాత్రి జరిగిన ప్రవచన కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ గులిపల్లి నారాయణమ్మ పాల్గొ న్నారు. ఈమేరకు శ్రీమద్రా మాయణ ప్రవచన సప్తాహకా ర్యక్రమంలో భాగముగా శ్రీరాముడు ధర్మస్వరూపుడు గురించి శ్రీసీతారామ భజన మండలి సభ్యులు గులిపల్లి సూర్యకుమారి భక్తులకు వివరించారు. శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమం టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్తు విజయనగరం జిల్లా శాఖ కన్వీనర్ జె శ్యామ్ సుందరం ఆధ్వర్యంలో జరుగుతుందని శ్రీసీతారామ భజన మండలి సభ్యులు గులిపల్లి చిన తిరుపతిరావు తెలిపారు. శ్రీమద్రా మాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. ఈకార్య క్రమంలో శ్రీసీతారామ భజన మండలి సభ్యులు గులిపల్లి భాస్కర రావు, శీర నారాయణరావు, నరసిం హులు, శ్రీరాములునాయుడు, భరత్ నాయుడు, బుచ్చియ్య , రేగయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 విజయమే లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ

ఐటిడిఏ పిఓ అభిషేక్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : విజయమే లక్ష్యంగా గ్రూప్ 2 మెయిన్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐటిడి ఏ పిఓ వి. అభిషేక్ హితవు పలికారు. గ్రూప్ 2 లో ప్రిలిమ్స్ లో విజయ సాధించి మెయిన్స్ కు అర్హత సాధించిన అభ్యర్థులను ఆయన అభినందించారు. వేపగుంట వైటీసిలో ఐటిడి ఏ ఆధ్వర్యంలో 21వ సెంచరీ ఎడ్యుకేషన్ సొసైటీ అందిస్తున్న సివిల్స్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాగా సాధన చేసి ప్రభుత్వ కొలువులు సాధించాలని చెప్పారు. గ్రూపు - 2లో విజయం సాధిస్తే గ్రూప్-1 పై నమ్మకం పెరుగు తుందన్నారు. మీరందూ ఏపీపి ఎస్సీ నిర్వహిస్తున్న పోటీ పరీక్షలలో విజయం సాధిస్తే గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందు తుందన్నారు. 11 మండలాల గిరిజన అభ్య ర్థులకు నమ్మకం పెరిగే విధంగా పోటీ పరీక్షలలో విజయం సాధించాలని సూచించారు. పాడేరు డివిజన్ ఐటిడిఏ పరిధిలో ఉన్న 117 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాతశాలల విద్యార్థులకు ఆదర్శంగా మీ ఫోటోలను చూపిస్తామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను ఆదర్శంగా తీసుకుని సివిల్స్ లో విజయ సాధించాలని సూచించారు. ఆయన సివిల్స్ సాధించడం వలన రాజస్థాన్ లో మూడు జిల్లాలు ఎంతో అభివృద్ధి సాధించారని స్పష్టం చేసారు. అనంతరం పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు జాగ్రఫీ పాఠ్యాంశాలను బోధించారు. ఎకనామిక్ సర్వే ఆఫ్ ఎపిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంతవరకు సిలబస్ పూర్తి చేసిన పాఠ్యాంశాలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఏ సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అభ్యర్థులను అడిగి తెలుసు కున్నారు. గ్రూప్- 2 మెయిన్స్ పై వారంతపు పరీక్షలు నిర్వహించాలని ఫ్యాకల్టీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎల్. రజని పాల్గొన్నారు.

మలేరియా ప్రభావిత గ్రామాల్లో దోమల మందు పిచికారీ

1767 గ్రామాలలో తొలివిడత స్ప్రేయింగ్ : జిల్లా కలెక్టర్ విజయసునీత

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : మలేరియా ప్రభావిత గ్రామాలలో ముందస్తుగా దోమల మందు పిచికారీ పనులు చేపట్టడం జరిగిందని అల్లూరి జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పేర్కొన్నారు. సోమవారం చింతల వీధి పంచాయతీ ఉబ్బేటి పుట్టు గ్రామంలో దోమల మందు పిచికారీ పనులను ఆమె ప్రారం భించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం నిర్దేశించిన గ్రామాలలో ఏసిఎం మందు పిచికారీ పనులు పూర్తి చేయాలని మలేరియా అధికారులను సిబ్బందిని ఆదేశించారు. వైద్యాధికారులు, క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది, మలేరియా సిబ్బంది సమన్వయంతో పని చేసి విజయ వంతంగా పిచికారీ పనులు పూర్తి చేయాలని సూచించారు. మొదటి విడత స్ప్రేయింగ్ కార్య చరణ ప్రకారం ఈనెల 15 వ తేదీ నుండి ఈనెల 30 వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 307 సచివాలయాల పరిధిలోని 1767 గ్రామాలలో దోమల మందు (ఎసి యం 5 శాతం)ను పిచికారీ చేయడానికి లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. పిచికారీ పనులను నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయాలని మలేరియా సిబ్బందిని ఆదేశించారు. దోమల మందు పిచికారీకి గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి టి. ఎస్. ఎస్. ప్రసాద్, డి.ఐ. ఓ సాధన, సబ్ యూనిట్ అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.